# మొగలిపూలు

ఆత్రమిల్లి విజయలక్ష్మి

**గుడిసె తలుపు లాగి బిగించి కట్టి కుందేటివైపు పరుగుతీసింది. ఉత్సాహంతో పరుగు పెడుతున్న ఆ లేత పాదాలకు ఇసుకతిన్నెల మీద మండుతున్న ఎండ వేడి తెలీడంలేదు. సంధించి విడిచిన బాణంలా రయ్ న ...**

మే నెల... ఎండమండిపోతోంది. ఉదయం అయ్యి కాకుండానే సూర్యుడు తాపాన్ని కుమ్మరిస్తున్నాడు. తెల్లవారుజామునే కుందేరు గట్టుకు పోయిన ముసిలయ్య అతికష్టంమీద నాలుగు మొగలిపొత్తులు పొదల్లోంచి తుంచేసరికి బారెడు పొడుగున ఎండెక్కేసింది. 'ఇయ్యాల్టికింతే... మర్రోండ్రోజుల దాకా పండవుపూలు' అనుకుంటూ మొగలిపొత్తులు ఎండవేడికి కగ్గిపోకుండా పచ్చి ఆకుల్లో చుట్టి పదిలంగా పట్టుకున్నాడు. గట్టుదిగి రోడ్డెక్కి వడివడిగా ఇంతంత అంగలు వేసుకుంటూ టౌనువైపు నడుస్తున్నాడు ముసిలయ్య. టౌన్లో బస్టాండ్ అతని వ్యాపారస్థలం. తన వాడ కట్టలో పూలుకొనే వాళ్ళెవరూలేరు. అక్కడంతా గంజికి గతిలేని కడుపేదలే! ఇక పూలకీ, సరదాలకీ ఎక్కడ తేగలరు? తలకి చమురే వుండదు... ఇక సిగలోకి పూలెందుకు? ఊళ్ళో అయినా ముసిలయ్య ఇంటింటికీ తిరిగి పూలు అమ్మడు. వేసవిలో కొల్లలుగా వచ్చే మల్లెలు— జాజులు, విరజాజులు — కనకాంబరాలు వీటికే మోజుపడతారు. ఆ మాలలు విధిగా రోజూ కొనుక్కొని తలలో తురుముకుంటారు కాని, మొగలిపూలు కొనరు. మొగలిపూలకి అందం తక్కువ. పరిమళం ఎక్కువ. మిగతా అన్ని పూలకీ ఉండే సౌకుమార్యం, అందం మొగిలి రేకుకుండదు. దాన్ని మాలగా కట్టుకోవడం కష్టం. ప్రత్యేకమైన పద్ధతిలో పువ్వులా అల్లి తలలో ముడుచుకోవాలి. పూలబజార్లో పావలాకి దోసెడు మల్లెలు పోస్తారు. పదిపైసలిస్తే ఇంత మరువం పెడతారు. ఒక మొగలిపొత్తు కనీసం రూపాయన్నా వుంటుంది. ఇక ఎవరు కొంటారు? అందువల్ల ముసిలయ్య వీధుల్లోకి తిరిగి పూలమ్ముకోవడం మానుకున్నాడు. అందువల్ల శ్రమేకాని ఆదాయం కనపడటంలేదు వాడికి.

పేర్లసావిడి వద్ద ఆగాడు ముసిలయ్య. నేర్పుగా నాలుగునిండుపొత్తుల్ని అరింటాకింద తయారుచేశాడు. లేకపోతే మళ్ళీ రెండు మూడురోజులకు పూలు విచ్చుకునే వరకూ పస్తే. విరిగిన పైగుడ్డకు మొగలి పొత్తులు చుట్టి మళ్ళీవేగంగా నడకసాగించాడు ముసిలయ్య. అక్కడ్నుంచి రెండుమూడు మైళ్ళు నడిస్తే టౌన్ బస్టాండ్ వస్తుంది. అక్కడే ముసిలయ్య పూలకి కాస్తగిరాకి. కాయకష్టం చేసుకునే పడుచుపిల్లలు- పుట్టింటినుంచి అత్తింటికో అత్తింటినుంచి పుట్టింటికో- మరే అన్నగారింటికో పోతూ ప్రయాణంలో పూలు, పళ్ళు కొనుక్కుంటారు. ముఖ్యంగా ఆ పల్లె పడుచులే రః మొగలిపూలు ఇష్టపడతారు.

ముసిలయ్య నడుస్తూనే ముఖం మీంచి దిగకారుతున్న చమటలు చేత్తో తుడుచుకున్నాడు. నిమిషనిమిషానికీ ఎండ తీవ్రత పెరిగిపోయి నిప్పులు కుమ్మరిస్తున్నట్టుంది. ముసిలయ్య సన్నగా, పొడవుగా — గాలివాటుకి వంగిపోయిన సర్విబొంగులా వుంటాడు. పీచులురేగి, ఎండుగడ్డిలావున్న జుట్టు— కండనేది లేకుండా కేవలం ఎముకల్ని కప్పివుంచిన చర్మం, పీక్కుపోయిన ముఖంలో ప్రస్ఫుటంగా అతికినట్లు కనిపిస్తున్న పెద్ద పెద్ద మిడిగుడ్లు... బారుగా వున్న నల్లని తారురోడ్డు మీద నడుస్తూనే వున్నాడు ముసిలయ్య. వాడికా నడకలవాటే! ఎండా వాన— వుదయం, సాయంత్రం— ఇవేవీ పట్టవు వాడికి. వాడి పాదాలు నిప్పులమీదైనా వడివడిగా నడవగలవు. ఎండలో నడిచినడిచి కాయలు కాసిన ఆ పాదాలకు వేడి బాధ తెలీదు. నల్లని దుమ్ముకొట్టుకుని ఉన్నవళ్ళంతా చమటకు చిత చితలాడుతూ బురద పూసుకున్నట్లుంది. తన చేతిలోని మొగలిపూలు దారినపోతున్న ఏ ఆడపిల్లనైన ఆకర్షిస్తాయేమోనని ఆశ. కదులుతున్న ఎర్రని గుడ్లతో అడపాదడపా అటు, ఇటు చూస్తున్నాడు.

అలా నిర్లిప్తంగా నడుచుకుంటూ అదిగో... టౌన్ బస్టాండ్‌కు వచ్చేసాడు ముసిలయ్య. ఒక్కక్షణం ఆగి ఎండి ఎముకలు కనబడుతున్న గుండెలనిండా గాలినింపుకొని ఒగుర్పు తీర్చుకున్నాడు.

"మొగిలిపూలు... మొగిలిపూలు" అంటూ బొంగురుగా అరుస్తూ బస్సుల్లో ఆడ ప్రయాణీకులు కూర్చున్న కిటికీల దగ్గర ఆగి, ఆగి తిరుగుతున్నాడు.

"ఇదిగో... ఎంత?"

"రెణ్రూపాలు..."

"అబ్బో....! రూపాయే గదయ్యా"

ముసిలయ్య తొందరపడదల్చుకోలేదు. ఇంకాసైముంది బస్సుకదలడానికి. ఒంగోలు బస్ దగ్గరికి వెళ్ళాడు ముసిలయ్య. బస్సు కదలబోతోంది. డ్రైవరెక్కేశాడు. కండక్టర్ రైట్ కొడుతున్నాడు. చప్పున ఒక పిల్లపిలిచింది. కిటికీలోంచి రెండ్రూపాయలిచ్చి ఒక పొత్తు అందుకుంది. 'ఆ పిల్ల కళ్ళల్లో మొగిలిపువ్వు మీద ఎంత అపేక్షో...' ముసిలయ్య గుండె ఆర్ద్రోలా అయింది. 'బేరమాడకుండా చెప్పినంతా ఇచ్చింది పిచ్చితల్లి! ఆ పొత్తునిండా లేత రేకులుంచితే బాగుండేది' బస్సు కదిలిపోయింది. ఇందాకటి పేట బస్సు కదలబోతోంది.

"రూపాన్నరియ్యమ్మా!" అన్నాడు ముసిలయ్య కిటికీ దగ్గర నిలబడి. లోపల్నుంచి కొసిరింది. "రూపాయి పావులా ఇత్తా" బస్సు హోరనుమోగింది ఆలస్యం చేస్తే బేరం పోతుంది. ముసిలయ్య ఇక ఆలోచించకుండా రూపాయి పావలా పుచ్చుకొని మొగలి పొత్తందించాడు.

ఇలా చాలాసేపు తిరిగి అయినకాడికి మొత్తం పొత్తులమ్మేశాడు ముసిలయ్య. అసలు పన్నెండు రూపాయలు రావాలి. పదన్నా వస్తాయనుకున్నాడు. ఎనిమిది రూపాయలే గిట్టాయి.

చిల్లర రొంటిన దోపుకొని ఇంటిముఖం పట్టాడు ముసిలయ్య. త్రోవలో షావుకారు దగ్గర 'సోలెడు నూకలు... పావులా చింతపండు... పది పైసల ఉప్పు... పావులా మిర్చి... నీరుల్లి' కట్టించుకున్నాడు

'నానంతే గంజిలో మిరపకాయో, ఉప్పుగల్లో నంజుకుని తినీగల్ను... పసిది... పిల్ల అల్లాడిపోద్ది... రొంతపచ్చడినూరితే సరిపోద్ది' ఊరి చివర పోరంబోకు స్థలంలో ఒక మూలగా వుంది ముసిలయ్య గుడిసె. భుజాన మూట వేలాడేసుకుని చేతులూపుకుంటూ వస్తున్న అయ్య దగ్గరికు గెంతుతూ వచ్చింది పదేళ్ళ ముత్తెం. "అయ్యా... అప్పుడే వచ్చేసినావా... ఎన్నిపూలమ్మినావే?" అని అడుగుతు.



"అయన్నీ ఆనిక సెప్తాగాని బేగెల్లి పొయి ముట్టించుమల్లీ! రొంత గంజి కాసుకుందాం" అయ్యమాట వింటూనే గెంతుకుంటూ వెళ్ళింది ముత్తెం. గుడిసె ఇవతల మూడురాళ్ళు పేర్చి అమర్చిన పొయ్యిలో ఎండుచితుకులు రెండువేసి మంటచేసింది. కుండలో నీళ్ళు పోసి ఎసరు మరుగుతుంటే రెండు పిడికిళ్ళు నూకలు పోశాడు ముసిలయ్య. చిన్నబండమీద గుండ్రాయితో ఉల్లిపాయ, ఎట్టెడంత చింతపండు, చిడికెడు ఉప్పువేసి పచ్చడి తయారుచేశాడు. ముత్తెం బొచ్చెలు, చెంబులో నీళ్ళు తెచ్చి అయ్యకి సాయం చేసింది. అయ్య వల్లార్చి పోసిన గంజి తాగుతూ "అయ్యా... మరే... మరే" అని సణుగుతుంటే "ఏటే తల్లా... మరే... మరే... అంటావేగాని ఏటో సెప్పవే..." అంటూ నడుం వాల్చాడు ముసిలయ్య. ఊరిచివర ఆరుబయలు ప్రదేశంలో గాలినిరాటంకంగా వీస్తోంది.

కుందేరు సమీపంలో ఉన్న గుడిసెల మీదకు ఏటిమీంచి చల్లని గాలి తెరలుతెరలుగా వీస్తోంది. పొట్టనిండా ఉప్పు గల్లు నంజుకొని నూకలగంజి తాగాడేమో ముసిలయ్యకు కళ్ళు కూరుకొస్తున్నాయి

కటిక నేలమీద వాలి జోగుతున్న వాడల్లా... "అయ్యా... అయ్యా" అన్న ముత్తెం గొణుగుడు విని కళ్ళుతెరిచి ఏటే బంగారూ... సెప్పవే?"

"అయ్యా మరే ... రేపే..."

"ఊ బేగిసెప్పమ్మా... నాకు తూలొత్తుంది"

"అయ్యా మరే... రేపే నాకో మొగిలిపొత్తియ్యవే" అంది గోముగా. అయ్య బొజ్జమీద చిట్టిచేత్తో ప్రేమగా నిమురుతూ.

"ఓలమ్మో... మొగిలిపొత్తే... ఎందుకమ్మా నీకు?"

"ఎందుకేటి... తల్లో ఎత్తుకుంతానే" గుండ్రటి చిన్నికళ్ళు ఆశగా తిప్పుతూ ఎర్రనూలు ముక్కముడివేసిన వేలెడు పిలక జడ ముందుకు వేసుకొని ముద్దుగా చెప్పింది ముత్తెం.

ముసిలయ్య ప్రేమగా నవ్వాడు. "అబ్బోసి...! నీ పిలక జెడకి మొగిలిపొత్తు కావాలంటే... అద్సరేగాని ముత్తెవా! వోరుకుడతారే నీకు తల్లో

పూలు'' అంటుంటే పిల్ల తల్లి గుర్తొచ్చినట్టుంది. ముసిలయ్య గొంతు కదిలింది.

''పోలక్కుడదరయ్యా... ఇంచక్కా చిన్ని చిన్ని పూలుకట్టి జెడనిండా కుడ్తది. ఇంచక్కుంటుందో... అయ్యా ఒక్క పాత్తియ్యవే... ఊ''

''ఏటి ఒకపాత్తే...''

''ఊఁ ఒక్క పాత్తేగదయ్యా...''

''మొగిలి పాత్తంటే మాటలే ఎర్రిపిల్లా... రెండ్రూపాలు''

''అయితే ఏటేటి...'' అలకగా మూతిముడిచి గునుస్తా అడిగింది ముత్తెం. కూతురి బుగ్గ పుణికి ''ఏటినేదే... సిట్టితల్లా... మొగిలిపూ నువ్ తల్లో ఎట్టుకుంటే మనయాపారం ఏం గావాలమ్మా... గంజిలోకి నూకలెట్టొత్తాయే..'' అనునయిస్తూ అన్నాడు ముసిలయ్య.

అయ్యా పూలమ్మి పైసలు తెస్తేనే అయ్యాల కూడని ముత్తేనికి తెలిసింది. అయినా తనడిగింది ఒక్కపాత్తేగందా ముత్తెం మరేమీ మాట్లాడలేదు. పసిదాని ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్న నిరుత్సాహం ముసిలయ్య గుండెను కదిలించింది.

''అట్టా దిగులు పడమాకే తల్లా... సూద్దార్లే... ఊఁసారి ఎక్కువ పాత్తులు దొరుకుతే తీసుకుందు''

ఆ ముక్కకే ముత్తెం ముఖం ఇంతైంది... ఆనందం దీపంలా ముఖమంతా వెలిగింది. సంతోషంగా కేరింతలు కొడుతూ ఆడుకోవడానికి వెళ్ళింది. రోజూ మొగలిపూలు కుట్టుకుని... చాకింటి గౌను వేసుకుని ఆడుకుంటున్నట్టు ముత్తేనికి ఎన్ని కలలో... రోజులు గడుస్తున్నాయిగాని అయ్య పువ్వు ఇవ్వనేల! పిల్ల మనసులో ఆరాటం, కోరిక పెరిగిపోతోంది. ''అయ్యా! యాడ్నుంచి తెత్తవే నువు పూలు...''

''కుందేర్నించి... లోతట్టుగట్టులో పొదలుంటయ్ ... ఆడకిపోయి దొంటుక్రతో లాగి కోత్తా...''

''మరందవా సేతికి...?''

''లోనికిపోతే అందుతయ్... పోగూడదు.. దూరాన్నుంచే కొయ్యాల''

''ఒడ పాములుంటాయంట గదయ్యా.. రాములమ్మ సెప్పింది''

''ఆ... ఉంటయ్.. పూలోసనకి పురుగు, పుట సేర్తది... పొదల్లోకి... జాగరతగా... ఒడుపుగా తుంపాల పూలు''

''ఊఁహూ'' అయ్య గుండెమీద తలవాల్చి నిద్రకు జోగుతోంది ముత్తెం.

'అదే ఆలాపన బిడ్డకి... ఒక్క మొగిలిపూతెచ్చి పిల్లమురిపెం తీర్చలేకపోతుండ' పిల్ల తల నిమురుతూ తన అసమర్థతకు బాధపడుతున్నాడు ముసిలయ్య.


'పుట్టి బుద్దెరిగినకాడ్నుంచి ఓ గోనడగల... ఓ బొమ్మడగల... ఇగో... ఉప్పుడీ మొగిలిపువ్వే అడగతాంది... పెద్దాకా అదే ఆలాపన... తల్లికెంత మక్కువగుందో? ఎట్టాగైనా ఊఁపాలి పిల్ల కోరిక తీర్చాల...' అని ఎప్పటికప్పుడు అనుకుంటూనే వున్నాడు ముసిలయ్య.

మిట్టమధ్యాహ్నం ఎండ మండిపోతోంది. 'అయ్య ఊఁళ్లోకెళ్లి పోయిండు... మల్ల పొద్దాకి వత్తడు' ముత్తెం గుడిసె తలుపులాగి బిగించికట్టి కుందేటివైపు పరుగుతీసింది. ఉత్సాహంతో పరుగు పెడుతున్న ఆ లేత పాదాలకు ఇసుక తిన్నెల మీద మండుతున్న ఎండవేడి తెలీటంలేదు. సంధించి విడిచిన బాణంలా రయ్ న ఒక్కపరుగులో కుందేటి గట్టుకు చేరింది ముత్తెం.

'ఊఁడ్నించే నాగుంది... అయ్య పూలు తెత్తాడు' అనుకుని కిందికి ఏట్లోకి తొంగిచూసింది. ముత్తెం ముఖం నిండా ఎంతో ఆనందం, ఆత్రుత. గట్టున ఆనుకొని ఏరుచుట్టూ ఏవేవో పెద్ద పెద్ద చెట్లు, పొదలు... ఏటిమీంచి వీస్తున్న గాలి ఎండతీవ్రతను తగ్గిస్తోంది. ముత్తెం క్షణం ఆగి అలుపు తీర్చుకుంది. రోడ్డు దాటి ఎత్తుగా ఉన్న గట్టు మీదకి వచ్చి నిలబడింది. బింకిరిబింకిరిగా కళ్ళుకట్టుబడుతున్న వెంట్రుకలు పైకి తోసుకుంటూ కిందకు తొంగి చూసింది. కింద పెద్ద వలయంలా నీటిగుంట ఉంది. చుట్టూ అంచున లెక్కలేనన్ని తుప్పలు పొదలు, ముళ్లమొక్కలు గజిబిజిగా అల్లుకుని వున్నాయి. ముత్తెం కళ్ళు మరుగ్గా తిప్పుతూ చుట్టూ చూసింది. 'ఊఁడ్నించే తెత్తడా... అయ్య పూలు... మరేటి.. మొగిలిపూలేడా అగపడవే...' అనుకుని ఆశ్చర్యంగా చుట్టూ చూస్తోంది. దట్టమైన చిట్టడవిలా ఉన్న ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉంది. ఏటికి ముందు భాగంలో దూరాన కొంతమేర రేవుగా చేసుకుని నీళ్ళకు వాడుకుంటారు. లోపలికి ఆవేపూ ఊఁవేపూ ఎవ్వరూ రారు. పూలమీద నిలవనీయని కోరిక ముత్తేన్నిలా తరుముకువచ్చింది. మొగలిపూల కోసం వెతుక్కుంటూ గట్టంట అడుగులో అడుగువేసుకుంటూ నడుస్తోంది ముత్తెం. తీరానికి అటు ఇటు అంతా మొగలిపొదలే. కాని పూలులేవు. ముత్తేనికవే మొగలి మొక్కలని తెలియదు. తీగెలు, తుప్పలు తప్పించుకుంటూ నడిచినడిచి గట్టు మధ్యకు వచ్చేసింది.

'ఊఁడానేవు పూలు... ఏటిసేద్దారి! అయ్యొచ్చేత్తాడేమో... పొద్దోతోంది. అనుకుని నిరుత్సాహంతో వెనుతిరగబోతుండగా మురిపిస్తూ పొదల్లోంచి చూసిందో మొగలి మొగ్గ! అటు ఇటు కలవరంగా చూస్తున్న ముత్తెం కళ్ళు తళుక్కున మెరిసాయి. చుట్టూకమ్మి ఉన్న ముళ్ళ ఆకుల మధ్యలోంచి లేలేత బంగారు రంగులో మిలమిలమెరుస్తున్న పువ్వును చూసి ముత్తెం టక్కున ఆగిపోయింది. ఆశ్చర్యంతోనూ, ఆనందంతోను ఆ చిన్నారి ముఖం వికసించింది.

'అగో... అదే మొగిలిపువ్వు... బలే.. బలే.. అని అలసటమరిచి ఇక పువ్వు కోసుకునే ప్రయత్నంలో పడింది. చేతిలో బారెడు పొడవున్న కర్రపుల్ల



సన్నగా

''ఒసేవ్ రాణి! మీ ఆయన నిన్నటి కంటే ఈ రోజు సన్నగా కనపడుతున్నాడేమిటి?'' అడిగింది రుక్మిణి

''అదా! ఈఁరోజు ఆయన స్నానం చేసారులే'' అంది.

—ఎస్. శ్రీనివాసరావు
(విశాఖపట్నం)


కాబోయి


సినీ నటి విలేకరితో

''నేను డాక్టర్‌ను కాబోయి యాక్టర్ని అయ్యానండి'' అంది.

''ఫర్లేదులెండి మనుషుల ప్రాణాలు తీయడానికి ఏదైనా ఒకటే'' నోరుజారాడు విలేకరి.

శివభారతి (హిందుపురం)





## ముగింపు

"మీ చిత్రం తాలూకు క్లయిమాక్స్ సీన్లో హీరో హీరోయిన్లు టీవీ చూస్తున్నట్లుగా ముగించారేం?" అడిగాడు విలేకరి.

"నిర్మాతగారే ముగింపు బాధాకరంగా ఉండాలని పట్టుబట్టేనూ" చెప్పాడు దర్శకుడు

-పద్మశ్రీ (మాణిక్యారం)

## ఎన్నికలు?

"డాడీ మా టీచర్‌కి ఏం తెలీదు. అన్నీ అబద్ధాలే చెబుతోంది" అంది పాప.

"ఏం చెప్పింది" అన్నాడు వాళ్ళ నాన్న

"మన దేశంలో ఎన్నికలు ఐదేళ్ళకోసారట"

_ఎ.వి.యం.పల్లవి (మెల్లకొండ)

వుంచుకుని చిన్నచిన్న అడుగులు జారకుండా నడుస్తూ గట్టుకిందికి వచ్చింది. 'అయ్యకీ పూ అగపడ్డేదు నాగుంది. అందుకే ఒగ్గేసిండు..' అనుకుంటే ముత్తెం మనసంతా సంభ్రమంతో నిండిపోయింది. పువ్వు తన సొంతమైపోయినట్టే మురిసిపోతూ దగ్గరగా వచ్చేసింది. కర్ర కొస చీల్చి చీలికల మధ్య చిన్నపుల్లముక్క వుంచి గుడ్డ పీలిక ముడేసింది. ఆమడ దూరంలో నిలబడి ముందుకు వంగి పువ్వు వంక చూస్తూ— కర్రపాదలో గుచ్చిలాగింది. పువ్వు తెగలేదు. మళ్ళీ బలంగా లాగింది. పొదకాస్త కదిలింది. పళ్ళు బిగించి బలమంతా పెట్టి మళ్ళీలాగింది. మొగలిపొత్తు తెగి కర్రతో పైకి వచ్చింది. 'వచ్చేసినాది... అబ్బ... ఎంత పెద్ద పువ్వో... ఎంత బాగుందాదో..!' అని పొంగిపోతూ కర్రలోంచి పువ్వును పదిలంగా తీసుకుంది. బేగి గుడిసెకి పోవాల... అయ్యకి పూ సూపించాల... అయ్య ఏటంటాడో? అక్కసేత తలసుట్టు పూలల్లింసుకోవాల..' అపురూపంగా పువ్వు సందిట పొదువుకొని ఒక్క ఉదుటన గట్టెక్కి రోడ్డు మీదకి వచ్చేసింది ముత్తెం.

మునిమాపువేళయింది. ముసిలయ్య పూల అమ్మకం పూర్తిచేసుకుని ఇంటిముఖం పట్టాడు. తడిగుడ్డకు చుట్టి వాడిచేతిలో ఉన్న ఒకే ఒక్క మొగలి పొత్తు దోవంతా పరిమళాలు విరజిమ్ముతోంది.

"ఇదిగో అబ్బాయ్ ... మొగలిపూలేనా! ఇటు తీసుకురా" అన్న పిలుపువిని చప్పున ఆగిపోయాడు. పెద్ద మేడముందు గేట్లో నిలబడి పిలుస్తోందో యువతి. పక్కనే ఓ చిన్నపిల్ల... పువ్వు కొనమని అమ్మని సతాయిస్తూ మారాం చేస్తూ.

"కొంటానన్నాగా... ఉండు... రానీవాడ్ని..." అని సముదాయిస్తోంది తల్లి. ముసిలయ్య అటు చూశాడు. 'పువ్వు కోసం మారాం చేస్తున్నట్టుంది పిల్ల... బేరం ఆడకుండా కొంటదేమో...' ముసిలయ్య మనసు ఊగిసలాడింది. అడుగు వెనక్కి వేయబోయి ఆగిపోయాడు.

"ఇది అమ్మటానికి కాదమ్మా" అనేసి కదిలాడు అక్కడ్నించి. వెనుకనుంచి చిన్ని చిన్ని పాదాలతో నేలని తన్నుతూ "అమ్మా... పువ్వే..." అని ఆ పిల్ల ఏడుస్తూ మారాం చేయటం వినిపిస్తోంది. ముసిలయ్యకు ముత్తెం గుర్తుకువచ్చింది. తలనిండా పూలుపెట్టుకుని సంబరపడిపోయే కూతుర్ని తలుచుకుని మురిపెంగా నవ్వుకున్నాడు.

ఇన్నాళ్ళకి పిల్ల కోరిక తీరుతోందన్న సంతోషంతో త్వరత్వరగా నడిచి గుడిసెకి వచ్చేశాడు. "ముత్తెమా... అమ్మాయ్... ముత్తెమా... బేగిరా..." అని అంత దూరంలోంచే పిలుస్తున్నాడు. 'తను చేతిలో పువ్వు పెట్టినప్పుడు చూడాలి పిల్ల ముఖంలో ఆనందం!...' తలుచుకుంటేనే ముసిలయ్య మనసంతా కూడా పులకించిపోతోంది. 'తనేం కట్టపడ్డా పిల్లదాని కోసమేగందా... ఓ రెండ్రోజులు గంజి తాక్కుంటే సరి' కష్టపడినా, నష్టపడినా ముద్దుల కూతురి ముచ్చట కాదనలేని తండ్రే ముసిలయ్య. అయ్య పిలుపుకి ముత్తెం బయటికి రాలేదు. ఎప్పుడూ ఆయాలకి గుడిసె ముంగిల పిల్లోళ్ళతో ఆడుకుంటూ అంత దూరంలోంచే పరుగున వచ్చి "అయ్యా... వచ్చేసినావా" అని సంబరపడుతూ కాళ్ళకు చుట్టేసుకునే కూతురు ఎదురవకపోయేసరికి ముసిలయ్య ఆరాటపడ్డాడు. గుడిసె లోపల, బయట అంతా వెతికి — ముత్తెం సావాసగాళ్ళను కూడా అడిగాడు. 'మాకు తెల్దంటే మాకు తెల్దన్నారు వాళ్ళు...' బిడ్డ ఎక్కడికి పోయిందా' అని ఆలోచిస్తూ, ఎదురుచూస్తూ గుడిసె ముంగిట్లోనే కూలబడ్డాడు ముసిలయ్య. బిడ్డ క్షణం అవుపడకపోతే వాడికి కూడుసయించదు కునుకుండదు. పంచప్రాణాలు ఆ పిల్లే!

ఇంతలో వెనుక నుంచి పరుగుపరుగున రొప్పుతూ వచ్చి "అయ్యా... వచ్చేసినా'వంటూ అయ్య మెడను వాటేసుకుంది ముత్తెం. ముసిలయ్య అలవి కాని ఆనందంతో బిడ్డను దగ్గరికి తీసుకున్నాడు. "ఎడకిపోయావమ్మా... వోరికీ సెప్పకుండా..." ముత్తెం తండ్రి మాటకు బదులివ్వకుండా "అయ్యా! నువ్వు కల్లు మూసుకో... ముందు..." అంది. గుబులు తీరిన గుండెతో ఆనందంగా నవ్వి "ఏట్టా బంగారూ... ఎందుకమ్మా..." అన్నాడు ప్రేమగా. "కల్లు మూసుకోమన్నానా... కల్లు మూసుకుని సెయ్యెట్టు..." అంది ముత్తెమ్మ వదలకుండా. "ఊఁ... సరే" అంటూ ముసిలయ్య కళ్ళు మూసుకున్నాడు నవ్వుకుంటూ. సాచిన అయ్య అరచేతిలో మూసిన తన గుప్పెట వుంచి వదిలింది ముత్తెం. 'ఇగ సూస్కో' అంది కిసకిసలాడుతూ. "ఏట్టా నాన్నా..." అంటూ కళ్ళు తెరిచిన ముసిలయ్యకు అరచేతిలో చెమటకు తడిసి నలిగిన రెండ్రూపాయల కాగితం కనిపించింది. అంతులేని ఆశ్చర్యంతో చూస్తున్న అయ్యతో "ఏటయ్యా... అట్ట సూత్తవ్.. మందే ఆ దబ్బు... మందేటికి పోయి మొగిలి పూతెచ్చినానయ్యా... ఓ యమ్మడిగితే అమ్మేసినా..." ముసిలయ్య కూతుర్ని అపురూపంగా దగ్గరికి లాక్కున్నాడు. "ఇంకెప్పుడూ ఆడకి పోమాకమ్మా. పురుగు, పుట్ట వుంటది... నీకేమైనా అయితే నే బతగ్గలనా... సెప్పు" అంటూ కన్నీళ్ళతో, చేతిగుడ్డలో చుట్టి తను తెచ్చిన పువ్వు ఆప్యాయంగా కూతురి కందిచ్చాడు. ముత్తెం నిదానంగా, నిరాసక్తంగా పువ్వు వంక చూసింది "నాకెందుకయ్యా పువ్వు... అమ్మితే నూకలు కొనుక్కోచ్చు గందా... నానూ అందుకే పూ అమ్మేసినానయ్యా..." ముసిలయ్య వింత పడుతూ కూతురి వంక చూశాడు. బతుకుభారం అప్పుడే మీద పడినట్లు అలసటగా వుంది. తలరేగి, అక్కడక్కడ గీరుకుపోయి, దుమ్ము కొట్టుకుని ఉంది ఒళ్ళంతా. నీరసంగా ఉన్న ఆ పసిముఖంలో విరునవ్వు మాటున ఏదో తృప్తి...!

*

